సాక్షి
చిత్తూరు
ఆదివారం । 9 । జూన్ । 2024



టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

ఎస్‌ఆర్‌పురం మండలం క్షీరసముద్రంలో టీడీపీ నేతల ఇళ్లపై ఆ పార్టీకి చెందిన వారే దాడికి పాల్పడ్డారు. - 8లో



రాయంచపై ఇంద్రవరదుని రాజసం

యాదమరిలోని త్రివేణి సంగమంలో ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. - 8లో



కొబ్బరి రైతుకు తెగుళ్ల దెబ్బ!

గుడిపాల మండలంలోని కొబ్బరి రైతును తెగుళ్ల బెడద వెంటాడుతోంది. గణనీయంగా దిగుబడి తగ్గిపోతోంది. - 8లో

న్యూస్‌రీల్

హింసను ప్రేరేపిస్తే సహించం

చిత్తూరు అర్బన్: జిల్లాలో ఎక్కడైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్పీ మణికంఠ హెచ్చరించారు. శనివారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం కొందరు సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో పెట్టిన వివాదస్పద పోస్టులను అడ్మిన్లు తొలగించాలని ఆదేశించారు. విగ్రహాలు ధ్వంసం చేయడం, వాహనాలకు నిప్పు పెట్టడం వంటి చర్యలను ఉపేక్షించబోమని పేర్కొన్నారు.

పీఏసీఎస్ పదవులకు రాజీనామా



తిరుమలరెడ్డి

నగరి : నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎ.తిరుమల రెడ్డి, డైరెక్టర్ నాగరత్నం తమ పదవులకు శనివారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల రీత్యా తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను జిల్లా సహకార శాఖ అధికారికి అందజేశారు.

కిక్కిరిసిన గొర్రెల సంత



బైరెడ్డిపల్లెలో నిర్వహించిన వారపుసంత

బైరెడ్డిపల్లె : బక్రీద్ పండుగను పురస్కరించుకుని శనివారం బైరెడ్డిపల్లెలో నిర్వహించిన గొర్రెల వారపు సంత కిక్కిరిసింది. పెద్దసంఖ్యలో రైతులు గొర్రెలు, పొట్టేళ్లు తీసుకురావడంతో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా వ్యాపారులు కొనుగోలు చేసేందుకు తరలివచ్చారు. పొట్టేళ్ల ధరలు రూ.40వేల నుంచి రూ.75వేల వరకు పలికాయి. గత ఏడాది కంటే గొర్రెల ధరలు బాగా పలికాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 68,830 మంది స్వామివారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని వారికి 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఓ చెట్టు.. సాక్షాత్తు ప్రధానమంత్రి కార్యాలయాన్నే కదిలించింది.. జాతీయ రహదారి రూటు మార్చింది.. నేషనల్ హైవే అథారిటీ అధికారులకు ముచ్చెమటలు పట్టించింది.. చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ సిక్స్‌వే అలైన్‌మెంట్ మార్పునకు కారణంగా నిలిచింది. ఇదేంటని ఆశ్చర్యపోతున్నారా..?.. సర్వత్రా చర్చనీయాంశంగా మారిన ఈ ఘటన పలమనేరు మండలంలో చోటు చేసుకుంది. ఒక్క రైతు పట్టుదల ఔషధ గుణాలతో విరాజిల్లే పురాతన వృక్షం ఉనికిని రక్షించింది. అభివృద్ధి పనులకు భూమి కోల్పోయినా పర్వాలేదు కానీ.. వంశ పారంపర్యంగా కాపాడుకుంటూ వస్తున్న అర్జున చెట్టును కూల్చేందుకు అంగీకరించని వ్యక్తిత్వం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.



పలమనేరు మండలం జల్లిపేట వద్ద హైవే పక్కన ఉన్న అరుదైన అర్జున చెట్టు

ఔరా.. అర్జున

SUNDAY SPECIAL

- పీఎంఓను కదిలించిన పురాతన చెట్టు
- మారిన చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే అలైన్‌మెంట్
- కారణంగా నిలిచిన 150 ఏళ్లనాటి అరుదైన వృక్షం
- ఔషధ గుణాలున్న చెట్టును కూల్చేందుకు ఒప్పుకోని రైతు
- ప్రధానమంత్రి కార్యాలయం చొరవతో రహదారి రూట్ మార్చిన అధికారులు

పలమనేరు : భారత ప్రధాని కార్యాలయాన్ని ఓ చెట్టు కదిలించడం ఏంటని ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. అయితే ఇది పచ్చినిజం. తమ భూమి ఎక్స్‌ప్రెస్ హైవేకి వెళ్లినా బాధపడని ఓ రైతు ఆ చెట్టును కూల్చేందుకు మాత్రం ఒప్పుకోలేదు. నేషనల్ హైవే అథారిటీపై ప్రధాని కార్యాలయానికి ఫిర్యాదు చేసి మరీ ఆ చెట్టును కూల్చకుండా కాపాడుకున్నారు. చివరకు రోడ్డు మార్గాన్నే మార్చేలా చేసి సంచలనం సృష్టించారు. ఈ ఘటన పలమనేరు మండలంలో జరిగింది. వివరాలు.. జల్లిపేటకు చెందిన సుబ్రమణ్యం అనే రైతు, స్థానిక కోర్టులో సీనియర్ న్యాయవాదిగా సైతం సేవలందిస్తున్నారు. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా ఆయన భూమిని సైతం అధికారులు సేకరించారు. తర్వాత రోడ్డు నిర్మాణంలో భాగంగా ఆయన పొలంలోని సుమారు 150 ఏళ్ల నాటి ఔషధ గుణాలున్న అర్జున వృక్షాన్ని హైవే అధికారులు కూల్చేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సుబ్రమణ్యం వెంటనే హైవే అథారిటీని సంప్రదించారు. ఆ చెట్టు ప్రాముఖ్యత, తమ పూర్వీకులనుంచి ఎలా కాపాడుకుంటూ వచ్చామనే విషయాన్ని వివరించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే చెట్టును వదిలేయమని విన్నవించారు. అయితే హైవే అధికారులు పట్టించుకోలేదు. దీంతో సుబ్రమణ్యం ఈ విషయాన్ని ప్రధానమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. ఔషధ గుణాలున్న విశిష్ట వృక్షాన్ని రక్షించాలని లేఖ రాశారు. ఈ చెట్టు ప్రాముఖ్యతను పరీక్షించేందుకు ప్రత్యేక నిపుణుల బృందాన్ని పంపించాలని పేర్కొన్నారు.

అనుకూలంగా నిపుణుల నివేదిక

సుబ్రమణ్యం లేఖపై పీఎంఓ స్పందించింది. చెట్టు విషయంలో వాస్తవాలను పరిశీలించాలని నిపుణుల బృందాన్ని గ్రామానికి పంపించింది. ఈ మేరకు నిపుణులు సమగ్రంగా చెట్టును పరిశీలించి అది అరుదైన ఔషధగుణాలున్నట్లు గుర్తించారు. ఇదే అంశాన్ని నివేదికలో పొందుపరిచారు. నిపుణుల సూచనలను పీఎంఓ పరిగణనలోకి తీసుకుంది. చెట్టును తొలగించకుండా రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని నేషనల్ హైవే అథారిటీని ఆదేశించింది. చివరకు చెట్టు పక్క నుంచి రహదారి వెళ్లేలా అధికారులు నిర్మాణ పనులు చేపట్టారు. కొత్తగా వేస్తున్న ఈ రోడ్డు పక్కన కొన్ని కిలోమీటర్ల పరిధిలో కనపడే చెట్టు ఇదొక్కటే కావడం విశేషం.

విశేష గుణాలు

ఈ చెట్టును శాస్త్రీయంగా టెర్మినలియా అర్జున అని పిలుస్తారు. ఇక్కడి ప్రజలు అర్జునుని చెట్టుగా చెప్పుకుంటారు. ఇది వృక్ష శాస్త్రంలో కాంబ్రేటేసీ కుటుంబానికి చెందినదిగా రైతు సుబ్రమణ్యం తెలిపారు. ఈ చెట్టు బెరడును గుండె నొప్పి, అధిక రక్తపోటు నివారణకు, కషాయాన్ని రక్తప్రసరణ సమస్యలు, అల్సర్ అరికట్టేందుకు వినియోగిస్తారని వెల్లడించారు. పాము, తేలు కాటుకు సైతం మందుగా వాడతారని వివరించారు. చెవిలో చీము కారడం, చెవి నొప్పి, దంతక్షయం నివారణకు, టూత్‌పేస్ట్‌గా సైతం ఇక్కడి వారు వినియోగిస్తుంటారని తెలిపారు.



ఎట్టకేలకు కాపాడుకున్నా



“అరుదైన అద్భుత ఔషదగుణాలున్న చెట్టును కొట్టేస్తారంటే చాలా బాధగా అనిపించింది. అందుకే ఈ చెట్టుకోసం ఏడాదిపాటు కష్టపడ్డా. అందరి దృష్టికీ తీసుకెళ్లా. చివరకు ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాలతో ఎట్టకేలకు చెట్టును కాపాడుకున్నా. ఇప్పుడు చాలా సంతృప్తిగా ఉంది. ఎంతో విలువైన ఈ చెట్టును రక్షించినందుకు జాతీయ వృక్ష అవార్డుకు సైతం నన్ను ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

– సుబ్రమణ్యం, రైతు, జల్లిపేట, పలమనేరు మండలం

అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా హాస్టళ్లలో పక్కాగా వసతులు కల్పించాలని, వార్డెన్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ షణ్మోహన్ స్పష్టం చేశారు. శనివారం ఆయన క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, గురుకుల, బీసీ, మైనారిటీ, విభిన్నప్రతిభావంతుల వసతి గృహాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఆయా శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులకు సక్రమంగా మెనూ అమలు చేయాలని, ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వసతి గృహాల్లో మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

కాణిపాకం ఆలయ కమిటీ చైర్మన్ రాజీనామా



ఈఓకు రాజీనామా పత్రం అందిస్తున్న మోహన్‌రెడ్డి

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ మోహన్ రెడ్డి శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఈఓ వెంకటేశుకు తన రాజీనామా పత్రం అందజేశారు. గణనాథుని ఆలయంలో భక్తులకు సేవ చేసే అద్భుత అవకాశం కల్పించిన ఆపద్ధర్మ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రెడ్డెప్ప, ఎంఎస్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై కేసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం రాత్రి ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. మొత్తం 3,261 సర్వీసులను తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ 92, తిరుపతి రూరల్ 66, పుత్తూరు 84, చిత్తూరు అర్బన్ 63, చిత్తూరు రూరల్ 44, మదనపల్లె 77, పీలేరు 30, పుంగనూరు పరిధిలో 79 కేసులు బుక్ చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 479 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.11.53 లక్షలు, చౌర్యం కేసులు 56కు గాను రూ.59 వేలు జరిమానాతో కలిపి మొత్తం 535 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.12.12 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి వివరించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు, వేసవి సెలవుల నేపథ్యంలో తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శనివారం ఒక్కరోజే సుమారు 31 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 1,407 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 2,878 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహు-కేతు పూజలకు 2,654 మంది, రూ.750 పూజలకు 1,074మంది, రూ.1,500 పూజలకు 379 మంది, రూ.2,500 పూజలకు 275 మంది, రూ.5వేల పూజలకు 89 మంది భక్తులు పాల్గొన్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,854 విక్రయించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.



క్యూలో వేచి ఉన్న భక్తులు

వరసిద్ధుని సేవకు తరలివచ్చిన భక్తుల ఆకలి దప్పులను తీర్చాలి.. స్వయంభువు సన్నిధిలో పసందైన విందు భోజనం వడ్డించాలి.. విఘ్నేశ్వరుని కటాక్షంతో అమృతతుల్యమైన అన్నప్రసాదం అందించాలి. ఇదే లక్ష్యంతో కాణిపాకం ఆలయం వారు ముందుకు సాగుతున్నారు. వేల సంఖ్యలో విచ్చేస్తున్న భక్తజనులకు ఎలాంటి లోటు లేకుండా ఆహారం అందిస్తున్నారు. రుచిగా..శుచిగా.. నాణ్యమైన వంటకాలతో అన్నదానం చేస్తున్నారు. ఎంతమంది వచ్చినా అందరికీ కడుపు నింపుతున్నారు.



అన్నదానంలో భక్తులు



- కాణిపాకంలోఉచిత అన్నప్రసాదం
- రుచికరంగా భక్తులకు భోజనం
- భారీ సంఖ్యలో బారులు తీరుతున్న జనం
- సంతృప్తికరంగా వడ్డిస్తున్న ఆలయ యంత్రాంగం

ఆహా.. అమృతం!

కాణిపాకం: అన్నం.. పరబ్రహ్మ స్వరూపం. ఆహారంలోని భాగమే అన్నం. వ్యవసాయ ప్రధానమైన మనదేశంలో అన్నానికి ఆధ్యాత్మిక అనుబంధం ఉందని వేదాలే చెబుతున్నాయి. ఈ మాటను నిజం చేసి చూస్తోంది..కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయం. ఈక్రమంలో కొన్నేళ్ల కిందట కాణిపాకంలో ఉచిత అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భక్తులకు ఉచితంగా అన్నప్రసాదం వడ్డిస్తున్నారు.

సాదరంగా ఆహ్వానిస్తూ..





అన్నం, పప్పు, సాంబారు, రసం, పెరుగు

వేడి వేడి అన్నం..దీంతో పాటు కూర, వేపుడు, సాంబారు, మజ్జిగ, రసం ఇలా ఓ మంచి శాకాహార భోజనం అది. ఇంతటి విందును భక్తుల కోసం కాణిపాకం ఆలయం ఉచితంగా అందిస్తోంది. అన్నదానం కదా అని ఆషామాషీగా చేయరు ఇక్కడ. వచ్చిన భక్తులను సాదరంగా ఆహ్వానిస్తారు. టేబుళ్ల ఎదుట కూర్చోబెట్టి మినరల్ వాటర్ సీసా ఉంచుతారు. చక్కగా అరిటాకు వేసి భోజనం వడ్డిస్తారు. ఈ క్రమంలో భక్తుల పట్ల అత్యంత శ్రద్ధ వహిస్తారు. ఎలాంటి చికాకు, చిన్నచూపు వంటివేమీ ప్రదర్శించకుండా మెలగుతారు. పరిసరాల శుభ్రతనూ, వ్యక్తిగత పరిశుభ్రతనూ పక్కాగా పాటిస్తారు.

రూ.కోట్లలో వ్యయం

ఒక్క భక్తుడి భోజన ఖర్చుగా రూ.47.85లని అధికారులు లెక్కకడుతున్నారు. ఇలా 2 వేల మందికి రోజుకూ రూ.95,700లు వ్యయం అవుతోంది. నెలకు రూ.2,8,71,000లు, ఏడాదికి రూ.3,44,52,000లు ఖర్చు అవుతున్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగినా, అన్నదానం రుచికరంగా ఉండేలా చూస్తున్నారు. భోజన తయారీ, వడ్డించే ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ..భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు..

ట్రస్టుకు విరాళాలు

నిత్యం భక్తులు హుండీలో వేసే కానుకలే కాకుండా ఆలయానికి సంబంధించిన వివిధ ట్రస్టులకు దాతలు విరాళాలు అందజేస్తుంటారు. ఈ క్రమంలోనే ఆలయవారు కొన్నేళ్ల కిందట అన్నదాన ట్రస్టు, గోసంరక్షణ ట్రస్టులను ప్రారంభించారు. వీటిలో అన్నదాన ట్రస్టుకు అత్యంత ప్రాధాన్యత ఉంది. తొలుత వందలాంది మందితో ప్రారంభించిన ఈ అన్నదానం ఇప్పుడు వేలాది సంఖ్యకు చేరుకుంది. వీటి దృష్ట్యా అన్నదానం ట్రస్టుకు భక్తులు విరాళాలు సమర్పించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తుంటారు. స్వామిపై ఉన్న అపారమైన భక్తితో రూ.వేలల్లో, రూ.లక్షల్లో విరాళాలు అందజేస్తుంటారు. ఇలా నెలకు అన్నదానం ట్రస్టుకు విరాళంగా రూ. 9 లక్షలు రాగా గతేడాది రూ.1.18కోట్లు వచ్చింది. శాశ్వత అన్నదానం స్కీమ్‌కు నెలకు రూ. 30 లక్షలు రాగా..ఏడాదికి రూ. 3 కోట్లపైగా ఆదాయం వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ట్రస్టుకు రూ.5,116పైగా విరాళం అందజేసే భక్తులకు శాశ్వత అన్నదానం స్కీమ్‌ను వర్తింపజేస్తామని, ఏడాదిలో ఒక్కరోజు, అది కూడా భక్తులు కోరుకున్న రోజున దాత పేరిట అన్నదానం చేస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు.

నిత్యం వేలాది మందికి..

కాణిపాకం వినాయకస్వామి వారి దర్శనానికి ప్రస్తుతం 30వేల మందికిపైగా భక్తులు వస్తున్నారు. సాధారణ రోజుల్లో భక్తుల సంఖ్య 10 వేలు దాటుతోంది. ఇందుకు అనుగుణంగా ప్రతిరోజూ ఉచిత అన్నదాన సముదాయంలో అన్నదానం జరుగుతోంది. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు అన్నం వడ్డిస్తుంటారు. అభిషేకాల సమయం మించడం, భక్తుల సంఖ్య పెరిగితే సాయంత్రం 5 గంటల వరకు కూడా అన్నదానం చేస్తుంటారు. ఇలా నిత్యం 2వేల మంది భక్తులకు ఆహారాన్ని అందిస్తున్నారు. రుచికరంగా వండిపెడుతున్నారు. నాణ్యత, శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ భోజనం రుచికరంగా ఉండడంతో భక్తులు సైతం తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. నిత్యం వేలాదిగా క్యూకడుతున్నారు. భక్తులకు అరిటాకులో కడుపు నిండేలా అన్నం పెడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఈ అన్నదానం ఒక్క పూట ఆకలి తీరుస్తోంది.

రుచికరంగా ఉంది



“పులిహోర, చట్నీ, అన్నం, భోజనం, సాంబారు పెట్టారు. బాగానే ఉంది. రుచికరంగా కూడా ఉంది. ఆలయంలో ఇలా అన్నదానం చేయడం గొప్ప విషయం. అందులోను అరిటాకులో భోజనం పెడుతున్నారు. దైవ సన్నిధిలో ఇలా భోజనం చేయడం వరంలా భావిస్తున్నాం. అరుపులు, కేకలు లేకుండా ప్రశాంతంగా తింటున్నాం. అలాగే సిబ్బంది కూడా అడిగి మరీ తినమంటున్నారు. కడుపు నిండుగా పెడుతున్నారు.

– శోభ, కర్ణాటక

తృప్తిగా తిన్నాం



మేం అన్నదాన మందిరంలోకి రాకముందే అరిటాకులో అన్నం, పలు రకాల తాళింపులు పెట్టారు. అంతా సిద్ధం చేసి ఆహ్వానం పలికినట్లు అనిపించింది. మర్యాదపూర్వకంగానే పిలిచి కూర్చోబెట్టారు. అన్నం వడ్డించి ఏం కావాలో అడిగి మరీ పెడుతున్నారు. భోజనం బాగుంది. నాణ్యతగా చేశారు. బయట రూ.100 పెట్టినా ఇంత రుచికరమైన భోజనం తినలేం. మేమైతే దేవుడి ప్రసాదంలా తృప్తిగా తిన్నాం.

– సుబ్బరత్నమ్మ, తిరుపతి

పకడ్బందీగా విత్తనకాయల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా రైతులకు వేరుశనగ విత్తనకాయలను పకడ్బందీగా పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ వేరుశనగతోపాటు అంతర పంటలకు సైతం విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. విత్తనాల పంపిణీలో సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున రైతులు ఇబ్బంది పడకుండా విత్తనాలు అందజేయాలని కోరారు.

వరసిద్ధుని సేవకు పోటెత్తిన భక్తులు



భక్తులతో నిండిన క్యూ

కాణిపాకం: కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామివారికి అర్చకులు విశేష అభిషేకం నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో కాణిపాకం ఆలయం కిక్కిరిసింది. క్యూ నిండిపోయింది. ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో అర్బన్ డెవలప్‌మెంట్ ఎండీ

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారిని శనివారం ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ హరిత కుటుంబ సమేతంగా సేవించుకున్నారు.ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.కార్యక్రమంలో ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



యాదమరి(బంగారుపాళెం):మండలంలోని బుడితిరెడ్డిపల్లెలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామ సమీపంలోని మంగలోళ్ల గుట్ట వద్ద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు గుర్తించి సమాచారం అందించినట్లు వెల్లడించారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు టీషర్ట్, జీన్స్ ప్యాంటు ఉన్నాయని, ఛాతీపై మనిమేగలై అని ఇంగ్లిష్‌లో పచ్చబొట్టు ఉందని వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు యాదమరి ఎస్ఐ 9440900684 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

అనుమానాస్పదంగా బాలుడి మృతి


సంజయ్ (ఫైల్)

వి.కోట: మండలంలోని ఎర్రినాగేపల్లెలో శనివారం అనుమానస్పదంగా ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన కోదండప్పకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు సంజయ్(11) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 5 వ తరగతి చదువుతున్నాడు. ఏమైందో తెలియదు కానీ, సంజయ్ గ్రామ సమీపంలోని పొలాల్లో మృతదేహమై కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలుడి మృతికి కారణాలను ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించిన సీఐ లింగప్ప వెల్లడించారు.

రాయంచపై ఇంద్రవరదుని రాజసం


సప్రం ఉత్సవంలో స్వామి అమ్మవార్లు


హంస వాహనంపై ఊరేగుతున్న స్వామివారు


ఉభయ దేవేరీ సమేతంగా వస్తున్న శ్రీవారు

- త్రివేణి సంగమంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు
- పురవీధుల్లో ఊరేగిన దేవదేవేరులు

యాదమరి : యాదమరిలోని త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాల అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం వేకువజామునే శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవర్లను సప్రంలో కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కనులపండువగా హంస వాహన సేవ

బ్రహ్మోత్సవాలలో భాగంగా రాత్రి ఘనంగా హంస వాహన సేవ నిర్వహించారు. హంస వాహనంపై కొలువుదీరిన స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

నేడు యాళివాహనం

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో మూడో రోజు ఆదివారం స్వామివారికి ఉదయం సప్రం ఉత్సవం జరిపించనున్నారు. రాత్రి యాళి వాహనంలో విహరించనున్నారు.

విద్యుదాఘాతంతో సబ్‌స్టేషన్ ఉద్యోగి మృతి

- మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం
- న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు ఆందోళన



ముత్తుకుమార్ మృతదేహం (ఇన్‌సెట్) ముత్తుకుమార్ (ఫైల్)

కుప్పంరూరల్ : మండంలోని గుడ్లనాయనపల్లె సబ్‌స్టేషన్‌లో శనివారం ఉదయం ఓ ఉద్యోగి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలు.. అడవిబూదుగూరుకు చెందిన ముత్తుకుమార్(29) సుమారు ఆరేళ్లుగా గుడ్లనాయనపల్లె సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. నెలవారీ మరమ్మతుల్లో భాగంగా ఉన్నతాధికారుల అనుమతితో విద్యుత్ సరఫరా నిలిపివేసి పనులు ప్రారంభించాడు. స్తంభం ఎక్కి మరమ్మతుల్లో నిమగ్నమై ఉండగా బ్యాక్ ఫీడింగ్ నుంచి హఠాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై మరణించాడు. ట్రాన్స్‌కో సిబ్బంది కుప్పం సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించి విద్యుత్‌ను పూర్తిగా నిలిపివేయించారు. సుమారు గంట తర్వాత ముత్తుకుమార్ మృతదేహాన్ని స్తంభంపై నుంచి కిందకు దింపారు. విషయం తెలుసుకున్న ముత్తుకుమార్ కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ముత్తుకుమార్ మరణానికి కారణం తెలియజేయాలని అధికారులను నిలదీశారు. పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు మృతదేహాన్ని పోస్టుమార్టానికి సైతం పంపించమని రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలను అంతరాయం ఏర్పడింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాన్స్‌కో అధికారులతో చర్చించారు. ముత్తుకుమార్ కుటుంబానికి న్యాయం చేస్తామని రాతపూర్వకంగా అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం.. కల్యాణం


విశేషాలంకరణలో స్వామిఅమ్మవారు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం విశేష అభిషేకాలు, అలంకరణలు చేపట్టి స్వామి,అమ్మవార్లను నిత్యకల్యాణ మండపానికి వేంచేపు చేశారు. అక్కడ వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి,అమ్మవార్ల కల్యాణం జరిపించారు. అనంతరం రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ ఆగమోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి, స్వామి,అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు


వివరాలు ఆరా తీస్తున్న డీఎస్పీ మూర్తి

- పార్టీ మండల అధ్యక్షుడి ఇంటిపై మరో వర్గం దాడి
- కేసు నమోదు చేసిన పోలీసులు

శ్రీరంగరాజపురం : టీడీపీ నేతల్లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. శుక్రవారం రాత్రి క్షీరసముద్రం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు జయశంకర్ నాయుడు, ఆయన సోదరుడు రాజశేఖర్ నాయుడి ఇళ్లపై పార్టీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త చిట్టిబాబునాయుడు వర్గం దాడికి పాల్పడింది. వివరాలు.. రాజశేఖర్‌నాయుడు కథనం మేరకు.. శుక్రవారం రాత్రి సుమరు 11 గంటల సమయంలో చిట్టిబాబునాయుడు వర్గానికి చెందిన సుమారు 120 మంది రాళ్లు,కర్రలతో తమపై దాడి చేసినట్లు తెలిపారు. ఇంటి కిటికీ అద్దాలు పగులగొట్టడమే కాకుండా, భౌతిక దాడులకు సైతం పాల్పడినట్లు వివరించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని లాఠీచార్జి చేయడంతో చిట్టిబాబునాయుడు అనుచరులు పరారైనట్లు తెలిపారు. రాజశేఖర్‌నాయుడు ఫిర్యాదు మేరకు చిట్టిబాబునాయుడు అనుచరులు నవీన్ చౌదరి, ప్రతాప్, శబరి, రవినాయుడు, శేఖర్‌రాజు, వాసు, బొజ్జయ్యపై కేసు నమోదు చేసినట్లు నగరి డీఎస్పీ కేఎస్ మూర్తి వెల్లడించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


రోగిని స్ట్రెచ్చర్‌పై తీసుకెళ్లాల్సిన ఆసుపత్రి సిబ్బంది రాక పోవడంతో రోగిని తీసుకెళుతున్న సహాయకులు


రుయా ఓపి బ్లాక్ నుంచి రోగిని భుజాలపై తీసుకెళుతున్న రోగి బంధువులు


వీల్‌చైర్‌పై రోగిని తీసుకెళుతున్న సహాయకులు

రుయా.. ఇంతేనయా.!

కనిపించని దేవుడు ప్రాణం పోస్తే.. కనిపించే డాక్టర్లు ప్రాణాలు నిలబెడతారని ప్రజలు నమ్ముతారు. ఆస్పత్రే దేవాలయంగా కొలుస్తారు. అందుకే దేవుడి తర్వాత డాక్టర్లకు అంత ప్రాధాన్యం ఇస్తారు. కానీ కలియుగ దైవం శ్రీనివాసుడి పాదాల చెంత ఉన్న తిరుపతి రుయాలోని కొందరు డాక్టర్లు, సిబ్బంది తీరుతో రోగులు నరకం అనుభవిస్తున్నారు. స్ట్రెచర్‌తోసే వార్డు బాయ్ కూడా రోగుల సహాయకులకు చుక్కలు చూపుతున్నారు. పేదల ప్రాణాలే కదా.. బోతే ఖోనీ అని గాలికొదిలేస్తున్నారు. తమ బంధువుల ప్రాణాలు కాపాడుకోవడానికి స్ట్రెచర్లు తోస్తూ.. రోగులను మోస్తూ.. వీల్ చైర్లు నెట్టుకొస్తున్నారు. అయ్యా.. బాబూ.. అని కాళ్లావేళ్లా పడుతున్నా కరుణించే నాథుడే కరువవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులూ కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

కొబ్బరి రైతుకు తెగుళ్ల దెబ్బ


చెట్టుపైనే తెగులు సోకిన కొబ్బరి కాయలు


కొబ్బరికాయలపై నల్లమచ్చలు

గుడిపాల: మండలంలో కొబ్బరి తోటలకు తెగుళ్ల సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవికాలం వచ్చిందంటే కొబ్బరికి భలే డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కొబ్బరికాయలకు మంచిగిరాకీ ఉంది. ఈ సమయంలో తెగుళ్ల సోకడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. వరి, మామిడి, చెరకు రైతులతో పాటు కొబ్బరిసాగు రైతులు కూడా నల్లతెగుళ్లతో ఆందోళన చెందుతున్నారు. కొబ్బరిచెట్లు సాగుచేయడానికి తక్కువ నీరు, తక్కువ ఖర్చు అవుతుంది. తరచూ కష్టపడి సాగుచేసిన పంటలవల్ల అప్పులు మిగులుతున్నాయని కొందరు రైతులు సాగుభూమిలో సైతం కొబ్బరిచెట్లు పెంచారు. ఈ ఏడాది కొబ్బరికాయల ధరలు అధికంగా ఉన్నా కాయలపై నల్లమచ్చలు ఉండడంతో సరైన ధర పలకడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో శ్రీరంగంపల్లె, 189 కొత్తపల్లె, వసంతాపురం, నంగమంగళం, మందిక్రిష్టాపురం, చింతగుంటూరు, కోలావూరు గ్రామాల్లో అధికసంఖ్యలో కొబ్బరిసాగు ఉంది. తెగులు నివారణకు ఉద్యానవనశాఖ అధికారులు సరైన అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.